సర్వ ప్రలోభాలకంటే మిన్న అయినదే, గోపీ!'' ఉద్రేకంగా అన్నది సులోచన.

''అదేంకాదు, సులోచనా! వాడికి జీవితం అంటే భయం. . . ఉత్త ఎస్కేపిస్ట్. పెళ్లి చేసుకోవటం భయం. ఉద్యోగం చెయ్యటమంటే భయం. ఎదురయ్యే జీవితసత్యాలను, సమస్యలను గమనించక, కలల ముసుగులో దాక్కొంటే సమస్యలు పరిష్కరింపబడతాయా? ఇదో విధంగా జడత్వం. . .'' సహాలుగా మాట్లాడుతున్నాడు కేశవమూర్తి.

''ఉద్యోగమూ, పెళ్లి జీవిత పరమావధి కాదుగదా! ఈ రెండింటిలోనే జీవితాన్ని చూడాలనేమీ లేదు. నా సంఘ కార్యక్రమాల్లోకాని, ఓ ఆర్తుడికి సేవచేస్తున్నప్పుడైనా, ఓ సంక్షేమనిధికి చందాలు వసూలు చేస్తూ ఊరూరూ తిరిగేటప్పుడూ, ప్రజల్ని జాగరితంచేసే మా ప్రయత్నాల్లోనూ మేము జీవితాన్ని ఎదుర్కొంటూనే ఉన్నాం. దానికి భయపడి పారిపోయే పిరికితనం మాలో లేదు.''

ఆ మాటలు విని సులోచన పగలబడి నవ్వింది.

''ఆ పనుల్లో నీకు నిజమైన ఆసక్తి లేదు. నీవు చేసే పనుల్లోని అంతిమ ప్రతిఫలం నిన్ను ప్రలోభ పెట్టేది కాదు. నీ సొంత పనిలో, దాని విజయం మీదుండే ఆత్రత, మానసికమైన [illegible] అపజయంలో ఉండవు. అందులో మవ్వు జీవితాన్ని [illegible] లేదు. ప్రతిఫలం ప్రలోభపూర్ణమైనప్పుడు నిష్ఠగా నీ కార్యక్రమాన్ని సాగిస్తే మేమంతా ఒప్పుకుంటాం. . .''

ఓ క్షణం మాగి బాధగా అన్నాడు గోపీ: 'హి ఇంటెగ్రిటీ' వేలంపాటలోనూ పెట్టేస్తే నేను చెప్పేదేమీ లేదు. ఈ సేవాకార్యక్రమం నా స్వంతం. . . ఎంత స్వంతమంటే— మనకు ఆకలి వేయుట మెంత సహజమో, అలా బాధాపరిలిప్తుణ్ణి చూసి నేను సంక్షుభితిస్వాంతుడయ్యే నటమూ అంత సహజం. అన్నం తినకపోతే మనిషి చచ్చిపోతాడు. నేను. . . నేను అనాథుణ్ణి, దరిద్రుణ్ణి. ఎన్ని దయార్ద్రహృదయాలు నన్నీ స్థితికి తీసుకువచ్చాయి! ఈ నిక్రుష్టుణ్ణి ఇంతకంటే ఏం చేయగలను. . .''

చెమ్మగిల్లిన కళ్లతో మాట్లాడే గోపీ మాటలకు, ఆ మాటల్లోని సత్యసంధతకు నిర్విణ్ణులైపోయి ఎవరూ మాట్లాడలేకపోయారు. గోపీలో తొటిమానవుడి మీదగల సహానుభూతి, ఎలా రక్తంలో ఒక పదార్థమై ఉందో [illegible] టికి, హిమాలయం ముందు నిలబడ్డ భీరువుల్లా ఉండిపోయారు.

**గోపీ ఎంతో ఉత్తముడైన వ్యక్తి. [illegible] మనసు ఎంతో సున్నితమైనది. ఎంత చిన్న కఠోర వాక్యం అయినా అతణ్ణి ఎంతగానో విచలితుణ్ణి చేస్తుంది. ఎంతైనా బలహీనుడతడు. ఆ బలహీనుడికి మరొక వ్యక్తి అసరా ఎంత అవసరమో పూర్తిగా గుర్తించింది సులోచన. అయినా దానిని తెలుసుకునే స్థితిలో లేడు గోపీ. అతడికి తెలిసేలా చెప్పడం ఎలా?**

అలా, అలా చాలాసార్లు గోపీని అతని వ్యాప్తినుండి మళ్లించటానికి ప్రయత్నించింది సులోచన.

'ఎలాగైనా అతణ్ణి ఈ ప్రవృత్తినుండి దూరం చేయాలి. ఇలానెంత బలహీనుడు ఇతనికి తోడు కావాలి. తను చేయి కలిపి అతణ్ణి అతని లక్ష్యంవైపు ఎంతో శీఘ్రంగా తీసుకువెళ్లగలదు.' ఆ ప్రయత్నంలో అతని పరిధిని విరగ్గొట్టి ఎలాగయినా లోపల ప్రవేశించాలి అనే తపనలో, ఏ ఋషి తపస్సో ఇంద్రుడు పంపగా, భగ్నం చేయ ప్రయత్నించే అప్సర మనఃప్రవృత్తి అలవరుచుకుంది సులోచన. ఆమనఃప్రవృత్తిలోనే అడిగేది గోపీని:

''మా నాన్నగారిచేత నీ కేదయినా ఉద్యోగమిప్పిస్తాను. చెయ్యరాదూ? ఈ ట్యూషన్లమీద వొచ్చేది నీ తిండికయినా చాలుతుందా? ఉద్యోగం చేస్తూ, నీ అవసరాలకుపోను మిగతా డబ్బు నీ సేవా కార్యక్రమాల్లో వినియోగించుకో వచ్చుగా?''

గోపీ ఆమె మాటలు వినేవాడు కాదు. ఆమెకూడా అతడు తన మాటలు విని ఉద్యోగం చేయాలని కోరుకొనేది కాదు. అతడు నిజంగా ఉద్యోగం చేయటానికి ఇష్టపడితే తన ఇష్టదేవత పదభ్రష్టమయినట్లు బాధపడేది. కాని ఇలా మాట్లాడటం అతని పరిధిలో కెలాగయినా చొచ్చుకుపోవాలనే ఉద్దేశ్యంతో గురిపెట్టి వదిలిన బాణం.

ఒక్కోసారి గర్వభంగమైన దేవకన్యలా గోపీని ప్రార్థించేది: ''పోనీ, అన్నేమీ వద్దు కాని, గోపీ. . . పెళ్లి చేసుకో. . . నీకు తోడు కావాలి. . . నాకు తెలుసు. . .నా మాట నమ్ము. . . నీకు అసరా ఇవ్వటానికి ఓ జోడీ కావాలి.''

గోపీ ఏమీ అర్థంకాని వాడిలా ఆమెకేసి అలా చూస్తూండి పోయేవాడు.

ఈ వేళ లాటరీటిక్కెట్టు బలవంతంగా అంటగట్టి అతనికి బాహ్యప్రపంచంలో సంపర్కం కలిగించానని సంతోషపడింది సులోచన ఓ క్షణం.

సులోచన లాటరీటిక్కెట్టు అంటగట్టి వెళ్లిన రెండు మూడు రోజులకు కాని, గోపీకి ధర్మాపతారావుగారి ఇంటికి వెళ్లటానికి తీరిక దొరకలేదు. తీరా వెళితే ఆయన లేరు. ఎక్కడికో కంట్రాక్టు పనిమీద వెళ్లారు. శ్యామలమ్మగారిని పలకరించి తిరిగి వెళ్లిపోదామనుకుంటుండగానే సులోచన ప్రత్యక్షమయింది.

''మిస్టర్ మహాశయా! ఈ వేళటికి తీరిక దొరికిందన్న మాట మీకు. . . పదండి, అమ్మని చూద్దురుగాని. నాన్న కంట్రాక్టుపనిమీద వెళ్లారు. . .''

శ్యామలాదేవి ఎదుటే లాటరీటిక్కెట్టు చర్చ వచ్చింది. సులోచన తానెలా గోపీకి లాటరీటిక్కెట్టు అంటగట్టిందీ, గోపీ ఎలా మొండికెత్తిందీ, తానెలా విజయం సాధించిందీ వివరిస్తూ బిగ్గరగా నవ్వుతూంది.

''నీకు డబ్బంటే ఆశ లేదుగా. . . నాకు తెలుసు. . . లాటరీలో ఫస్టు ప్రయిజు నీకే వస్తుంది. డబ్బుతో అవసరం లేనివాళ్లకి, దాని ఉపయోగం తెలియనివాళ్లకే వస్తుంది. ఆశతో ఎదురు చూసేవాడికి కోరింది లభ్యంకాకపోవటం జీవిత రహస్యం. . .'' నవ్వుతూ చెబుతూంది సులోచన. శ్యామలాదేవి గారాబు కూతురి తెలివితేటలకు ప్రగల్భంగా చూస్తూంది.

''వద్దులే, సులోచనాదేవి! నీ కో సారి చెప్పాను— లాటరీలంటే నా కిష్టం లేదని. మానవుడి క్రియాశీలక శక్తిని నాశనం చేస్తున్నాయి ఈ లాటరీలు. కష్టపడి పని చేయాలనే ప్రాథమిక మాత్రం మానవుడు విస్మరిస్తుంటే, కష్టపడకుండా వచ్చే ఈ లాటరీడబ్బుతో సుఖం కొనుక్కోవాలనే ఆశ వికృతిలో పడతారు. ఎంతమంది బీదవాళ్ళు తమకు లాటరీవస్తుందనే ఆశలంబంతో పతనానికి ముదుపుపెట్టి చేశారో. ఫస్టుప్రయిజు అయిదు లక్షల్నీ! ప్రతి ఒక్క రూపాయిలో నుండి ఓ మానవహృదయం డబ్బు కోసం ఆక్రోశించిన ట్లనిపించదూ? అయినా నాకొస్తే నేనేం చేసుకుంటా నా డబ్బు! వీలాంటివాళ్ల కొస్తే ఉపయోగం.''

''భలేవాడివే! అలా అంటావేం. . . నీ సేవాకార్యం కొనసాగించుకోవచ్చుగా?''

''లేదు, సులోచనా! ఈ డబ్బుతో నా సేవాకార్యం సాగదు. అప్పుడు దాని పవిత్రత చెడిపోతుంది.''

''నీ దో పిచ్చిగాని బాబూ! లక్ష్మికి పవిత్రత, అపవిత్రత ఏమిటి?'' ఈ సంభాషణంతా వింటూ ఉండబట్టలేక అంది శ్యామలాదేవి.

''డబ్బుకు కాదమ్మగారూ! అది సంపాదింపబడే విధానంలో కాని, అది ఖర్చయే విధానంలోకాని ఉన్నాయి దాని పవిత్రతాపవిత్రతలు. ఓ మహత్కార్యంలో లక్ష్యమొక్కటే ఉత్తమమయితే చాలదు. దాని సాధనామార్గంకూడా ఉత్తమంగా ఉండాలి.''

గోపీ మాటలు శ్యామలాదేవికి ఇష్టం. 'ఈ పిచ్చివాడు ఎలా బతుకుతాడీ ప్రపంచంలో!' అని తలుచుకున్నప్పుడల్లా ఆర్ద్రమయ్యేది ఆమె మనస్సు.

రోజులు గడిచిపోతూనే ఉన్నాయి నిర్మోహంగా.



